
మనసు కుదరని పెళ్ళి
మరుదినమ్మున కుళ్ళి
సుఖము హళ్ళికి హళ్ళి
ఓ కూనలమ్మా



ఆలి కొన్నది కోక
అంతరిక్షపు నౌక
అంతకన్నను చౌక
ఓ కూనలమ్మా

పసిడి వన్నియ తరిగె
వన్ను లెన్నియొ పెరిగె
ప్రజల వెన్నులు విరిగె
ఓ కూనలమ్మా *



వివిధ నీతులు గలవి
పెక్కు బుక్కులు చదివి
నేను చేసెద మనవి
ఓ కూనలమ్మా

* దీనికి అభ్యుదయ పాఠాంతరం :

పసిడి వన్నియ తరుగు
ప్రజల కెంతో మెరుగు
పాత మౌఢ్యము విరుగు
ఓ కూనలమ్మా



# కలలు - కలవరింతలు

*మంజుశ్రీ

(2)

సావిత్రికి అంతా తీరికే, అందుకే మరీ పదిహేనురోజులనుంచీ పొద్దుటే ఆయనాఫీసుకెళ్ళినప్పటినుంచీ మళ్ళీ సాయంకాలం ఆరు గంటల దాకా చిరాకెత్తి పోతున్నది సావిత్రికి. ఏమీ తోచి చావదు. కోపగించుకుందామనుకున్నా కూడా మనుషులెవ్వరూ లేరు. ఎవరి మీద కోపగించుకోవాలో కూడా తెలీటం లేదు.

నగరానికి దూరంగా విసరివేయబడ్డట్టుగా వున్న యీ భవనంలో యెట్లా పొద్దు పోతుంది! మనస్సు కేమిటో దిగులుగా వుంటుంది. వొంటరి తనం. బిక్కు బిక్కుమంటున్నట్లుగా వుంటుంది.

ఆయన పిసినారి తనం కలవారు కాదు కాని, మొదట నగరానికి దూరంగా, ప్రశాంతంగా వుండేందుకు తాను కూడా ఉత్సహించింది. అందుకే ప్రోత్సాహ పరచింది. పైన తాను ఇప్పుడు బాధపడుతున్నట్లుగా, మొదట మొదట బాధపడవలసిన అవసరం లేక పోయింది. నిజానికి తాను వొంటరిదైనా ఇన్నాళ్ళూ ఇతరులకు తాను వొంటరిదికాని, ఇప్పుడు తనకే తెలిసిరావటం బాధాకారణమైంది. మొదట్లో పక్కింటి పిన్నిగారు, ఏడుగురు పిల్లల తల్లి "నీకేవమ్మా సావిత్రమ్మా, అంతా తీరికే, ఎంత సుఖం ఎంతహాయి. నాకు చావొస్తున్నది యీపిల్లలతో వేగలేక' అంటే నిజంగానే తాను సుఖపడి పోతున్నాను కాబోలును అనుకునేది. కాని ఇప్పుడు అలా అనిపించటంలేదు, విచిత్రమే! అసలు యీ రెండు భాగాల వాళ్ళూ ఒక్కసారిగా ఖాళీ చేసి పోకపోయినట్లైతే ఇప్పటికీ తనకు తెలిసేదికాదు యీ బాధ.వాళ్ళు వున్నంత కాలం, యెప్పుడు వెళ్ళిపోతారా భగవంతుడా అనుకునేది ఇప్పుడనిపిస్తున్నది. వాళ్ళు వుండి వుంటేనే బావుండేది అని. మనస్సు పీకుతున్నది అయ్యో వాళ్ళను ఇంకా ప్రేమించలేదే అని, ఇంకా అభిమానించలేదే అని! అయోమయం మనుషులని యెందుకు విసుక్కున్నానా! అని, కాని వాళ్ళు వెళ్ళి పోయారు. మళ్ళీ ఏ వూళ్ళోనో, ఏ ఇరుకైన అద్దె కొంపలోనో, మూడవ తరగతి రైలు పెట్టెలా, వాళ్ళ జీవితం సాగిపోతూనే వుంటుంది.

నగరానికి కొంచెమేం, బాగానే దూరంగా వున్న ఆ పేటలో విశాలమైన ఆ మేడలో చౌకగానూ, సౌకర్యంగానూ, ఒక భాగం అద్దెకు దొరుకు తున్నదికదా అని సావిత్రి వాళ్ళు అద్దెకు తీసుకున్నారు. నగరాల్లో ఇళ్ళు చౌకగా అద్దెకు దొరకవు. ఆఫీసులూ ఇళ్ళ దగ్గరగా వుండవు. రోజూ ఊరికి పోయి వచ్చినట్లుగా, సన్నకారు ఉద్యోగస్తులంతా లోకల్ ట్రెయిన్స్

కోసమూ, సిటీ బస్సుల కోసమూ, యెదురు చూస్తూ, విసుక్కుంటూ, వేసారుతూ, మళ్ళీ సాయం కాలానికి దీపాలు పెడుతుండగానూ, పెట్టిన తరువాతనూ పగిలిపోయిన చీమల పుట్టలు పుట్టలులాగా, మేతకు పోయిన పక్షులు గూళ్ళు చేరుకునే రీతిగా, అలసిపోయి ఇళ్ళకు వస్తారు. నిజానికి సావిత్రీ వాళ్ళు, ఆయన ఆఫీసుకు అంత దూరంగా వుండవలసిన అవసరమేమీలేదు. వాళ్ళకు ఇల్లు అంత చౌకగా దొరకవలసిన అగత్యమూ లేదు. అయినా ప్రశాంతత కోసమే అంత దూరం వచ్చారు.

ఆ ఇంట్లో చేరిపోగానే ఆయన అన్నారు "అమ్మయ్య ప్రాణం లేచి వచ్చింది. ఇక్కడ అంతా చూస్తుంటే చిన్నప్పుడు మా ఊళ్ళో వున్నట్లుగానే వుందినాకు. ఈ పెరట్లో చెట్ల పాదులు పెంచుకోవచ్చును. మనం గేదెను కొనుక్కున్నా ఇబ్బందిలేదు ఇక్కడ" అంటూ యెంతో ఉత్సాహం చూపారు. ఆయన గారి అంత ఉత్సాహాన్ని చూసి సావిత్రి కూడా నిజమే కాబోలుననుకుంది. కాని ఎత్తైన వరండాలోంచి. దిగులైన సాయంకాలపు వేళల దూరంగా లోకల్ రైల్వే స్టేషన్ వేపూ, ఆ పట్టాల వేపూ అటూ ఇటూ అరుచుకుంటూ వెళ్ళిపోయే రైళ్ళ వేపూ చూస్తుంటే "చుట్టు చుట్టు పక్షులెల్ల చెట్టు వెదకు రీతిగాను, పట్టులేక నీపదములు పట్టు కొందు, త్యాగరాజ వినుత, రామా" అన్న కృతి మాత్రమే గుర్తు వస్తున్నది. కాని, ఆయన గారు వర్ణించిన సౌఖ్యమంతా, వర్ణనల లోనే వుండిపోయినట్లనిపిస్తున్నది సావిత్రికి.

ఆ మేడలో మూడు భాగాలున్నాయి. మేడపై భాగాన ఇంటి వాళ్ళు సామాను భద్ర పరచుకుని, పెద్దపెద్ద తాళాలు వేసుకుని, యెక్కడికో వెళ్ళి పోయారు. క్రింద మూడు భాగాలున్నాయి. మూడున్నూ సమానమైన భాగాలే అయినప్పటికి, మధ్య భాగం తక్కిన రెండింటి కన్నా ఇంకొంచెం సౌకర్యంగా వుంటుందని పక్క రెండు భాగాల వాళ్ళూ అనుకుంటూ వుంటారు. అందులో ఏకొంచెమో నిజం లేకపోలేదు. సావిత్రి వాళ్ళు వచ్చేసరికి మధ్య భాగం ఖాళీగాలేదు, అందువలన వాళ్ళు పక్క భాగంలోనే చేరిపోయారు. ఆ మధ్య భాగంలో వుంటున్నాయన సావిత్రి వాళ్ళాయనకు స్నేహితుడు కావటమూ, ఆయన ప్రోత్సాహం వల్లనే దూరమైనా సావిత్రి వాళ్ళు ఆ ఇంట్లో చేరటమూ జరిగింది. ఆ ఇల్లాలే యేడుగురు పిల్లల తల్లి. ఆమెకు యెంతో వయస్సు కూడా లేదు. ఆమెను సావిత్రి పిన్నిగారని పిలిచినా, అలా పిలవటానికి వొప్పుకోవటమే కాకుండా మౌనంగానైనా వుండక అ పిలుపుకి 'ఊ' కొట్టేది. ఇంతాచేస్తే ఆమె సావిత్రి కంటె మహా అయితే పదేళ్ళు పెద్దది కావచ్చు. ఒట్టి వెర్రి బాగుల్ది. పిల్లలు పుడితే వుట్టినే వయసు పైబడుతుంది కాబోలు. అంటే క్షమా, ఓర్పు, నిగ్రహమూ, నిండుతనమూ అన్నీ వచ్చేస్తవి కాబోలు. సావిత్రికి ఆ పొరుగు పిన్నిగారి పిల్లలగోల తట్టుకోవటం కష్టంగానే తోచినా, ఒకరకంగా ఆమెతో బాగా కాలక్షేపం జరిగిపోయేది. అయితే అలా యెక్కువ కాలం సాగలేదు. వాళ్ళు బదిలీ అయి మరోఊరు వెళ్ళిపోయారు. అప్పుడే సావిత్రివాళ్ళు మధ్య భాగంలోకి వచ్చారు. పదిరోజుల పాటు ఆ మధ్య భాగంలోకి వచ్చిన తరువాత



సావిత్రికి చిర్రెత్తిపోయింది. పిల్లల సౌఖ్యం తెలిసి వచ్చింది. నవ్వూవచ్చింది. గోడల నిండా "అ ఆ" లు ఇంకా ఆంజనేయ స్వామి బొమ్మలూ, ఇస్త్రీ బట్టలు, పాలవానికి, బొగ్గులకు- మొదలైన పద్దులు. అల్మారాలలో పగిలి పోయిన గోలీలు, తీసేసిన సిగరెట్ పెట్టెలు మొదలైనవన్నీ యెక్కడబడితే అక్కడే ప్రత్యక్షమైనాయి. సుద్ద ముక్కలతో వ్రాసినవిమాత్రం వోపిగ్గాచెరిపేసింది సావిత్రి. పెన్సిళ్ళ ఉపయోగాన్ని బాగా తెలుసుకున్న వాళ్ళ పిల్లలు చాకలి పద్దులను శాశ్వతం చేసిపోయారు కొన్ని గోడలమీద. ఇక వాళ్ళు వేసిన ఆంజనేయ స్వామి బొమ్మలూ, బాతులూ, చిలకలూ, అవ్వన్నీ చూసి. వాళ్ళ కళాకౌశలానికి అబ్బురపడకపోగా"మీ బొమ్మలే వేసుకున్నార్రా!" అని లో లోపలే కోపం తెచ్చుకుంది సావిత్రి. సరే అలా కొన్నాళ్ళు కాలక్షేపమైంది. అదీ నయమే! తరువాత తాము ఖాళీచేసిన భాగంలోకి యెవరో వచ్చారు. ఈ వేపు ఇదివరకే వున్నారు. ఈ వేపు భాగంలో వో కుటుంబమూ, ఆవేపు భాగంలో వోకుటుంబమూ వుండటం మూలాన, సావిత్రికి తోచకపోవటమంటూ లేకపోయింది. ఇది ఇదివరలో కథ.

ఇప్పుడు ఆరెండు భాగాల వాళ్ళూ వది పదిహేను రోజులు అటూ ఇటూగా ఖాళీచేసి పోయారు.ఉన్నన్నాళ్ళూ వాళ్ళను విసుక్కున్నా వాళ్లు వెళ్ళిపోయిన తరువాత, వాళ్ళ విలువ తెలిసి వచ్చింది సావిత్రికి. వాళ్లు వెళ్ళిపోతున్నారన్నప్పుడే దిగులైంది. వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత మరీ దిగులైంది. సావిత్రి వాళ్ళను విసుక్కోక పోయేదే! ఏం చేస్తుంది, ఒక భాగంలో వున్నవాళ్ళ చంటిపాప యేడ్చినప్పుడు ఆ భవనం తాలూకు పునాదులన్నీ కదిలిపోయేట్లు యేడ్చేవాడు. వాడు ఆకలైతేనే యేడ్చేవాడు. వాడికి "యెప్పుడూ ఆకలే" అని వాళ్ళమ్మ విసుక్కునేది. పాలు కలిపి పట్టేలోపునే గందరగోళం చేసేవాడు ఆపాపడు. ఇంకయీ వేపు భాగంలో వో ముసలాయన వుండేవాడు. అర్ధరాత్రి మొదలుకొని మనుషులను నిద్రపోనిచ్చేవాడు కాదు. పాటలూ పద్యాలూ. "బధ్వాకశైర్యమ భటా బహుభర్త్సయన్తి, కర్షన్తి యత్రపధి పాశ శతైర్యదామామ్, ఏకాకినం పరవశం చకితం దయాళో, లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబమ్" మొదలుకొని "రామారామాయనవేపాపపు జింహ్వే..." వరకూ ఎన్నో పాటలు పాడేవాడు. అర్ధరాత్రి లేచికూచుని యమభటులు వచ్చి ఏదురుగా నిల్చినట్లూ, వారిబారి నుండి తనను రక్షించమని వేడుకుంటున్నట్లూ మొదలు పెట్టేవాడు. ఓసారి వుండబట్టలేక చిన్నగా పాడుకోమని చెపుదామని సావిత్రి వెళితే, జగన్మిథ్యా తత్త్వమూ, జీవేశ్వర సంబంధమూ మరీ బోధించిగాని ఆయన వదలి పెట్టలేదు. అందుకని అప్పటి నుంచి ఆయన యెదుట పడటానికే భయపడేది సావిత్రి. ఆయన పాటలను, పద్యాలను, చచ్చినట్లు విధిగా భరించేది. ఆపాప మరీ చిన్న పాప. ఈ తాతగారు మరీ పెద్దవారు. వీళ్లిద్దరినీ తలుచుకున్నప్పుడల్లాసావిత్రి వెడనవ్వు నవ్వుకునేది, పిల్లలు లేకపోతె మానె అనీ, కుటుంబంలో పెద్దవాళ్లు లేకపోయినా సరే అనీ అనుకునేది.

ఓసారి ఎవరో జాలిని వ్యక్తపరిచారు. సావిత్రికి పెద్దదిక్కు యెవరూ లేరే అని. ఇంకోసారి ఇంకోరు చిన్నదిక్కు కూడా యెవరూ లేరే అని (అంటే పిల్లలు) సానుభూతి చూపబోయారు. సావిత్రికి కోపమొచ్చింది అప్పుడు. తనబాధ వీళ్ళకెందుకూ అనిపించింది. అలా కాలంగడుస్తూ వచ్చింది.





ఇప్పుడైనా మరీ తోచక ఆమె బాధ పడుతున్నది కానీ, మరెందుకూ కాదు. అంటే ఇవి లేకపోయెనే అనీకాదు. ఇవి వుంటే బావుండునే అనీకాదు. మరీ బాధాకరమైన విషయం యేమిటంటే, రెండుభాగాలూ ఖాళీగావున్నవని ఆయనకు తెలుసు. తెలిసినా "నీకు యెలాపొద్దు పోతోంది. పుస్తకాలేమైనా తెచ్చి ఇవ్వనా? పోనీ ఇవాళకు సినిమాకు వెళ్దామా" అనికానీ అడగక పోవటం. అసలాయనకు అంతదూరం ఆలోచన పోతే కదా! తన పెండ్లి అయి పదేళ్లు కావస్తోంది ఆయన ఇకమారేది లేదు అనుకుంటుంది సావిత్రి. కాని, అనుకోకుండా ఒకరోజున హటాత్తుగా ఆయన తనకొక సంతోషకరమైన వార్త చెబుతారని సావిత్రి అనుకోలేదు. ఆయన చెప్పారు, "తన స్నేహితుడే ఒకడు ఆ ఇంట్లోకి వస్తాడుట. ఇవాళ ఆఫీసులో కన్పించి చెప్పాడుట. ఈ వూరికి కొత్తగా బదిలీ అయి వచ్చాడుట అతను, అయితే ఇంకా నెల రోజులు పట్టవచ్చునట అతడు సంసారం తీసుకొచ్చుకునే సరికి. గుడ్డిలో మెల్ల అని సంతోషించింది సావిత్రి.

మర్రోజు సాయంకాలం ఆయన తన స్నేహితుణ్ణి వెంటబెట్టుకొచ్చారు. తాళంతీసి భాగమంతా చూపించారు. అవతలివేపునున్న భాగంకూడా ఇంతేనని చెప్పారు. ఆ తరువాత తను వరండా బయట గదిలో కూచున్నారు. తాను కాఫీ తీసుకపోయి యిచ్చినప్పుడు, ఆయన తనను స్నేహితునికి పరిచయమూ చేశారు. తాను చనువుతీసుకుని ఆడవాళ్ళను త్వరగా తీసుకరమ్మనీ చెప్పింది. అతడా పూట అక్కడ భోజనమూ చేశాడు. చిట్టచివరి లోకల్ ట్రెయిన్‌కు వెళ్ళిపోయారు. సావిత్రికి ఆనందమూకాదు, విచారమూ కాదు, ఎందుకో ఒకందుకు మనసున చాలా వింత అనిపించింది, అతడు గుర్తుపట్టాడో లేదోకాని, తనకు జ్ఞాపకంవచ్చాడు. పదేళ్ళ కిందట ఇతడే పెళ్ళిచూపులకు వచ్చినప్పుడు, తెగబడి, యెవరు చెప్పినా వినిపించుకోక, ఖండితంగా 'నేను చేసుకోను, ఈ సంబంధం నా కొద్దు' అని చెప్పింది తాను. తన మొండితనానికి తమవాళ్ళంతా ఆశ్చర్యపోయారు. అప్పటికి కుర్రవాడు ఇంటర్‌మీడియట్ మాత్రమే ప్యాసుకావటమూ, చేస్తున్న ఉద్యోగం చూడబోతే, సెక్రెటేరియట్ గుమాస్తాగిరీ, ఇంకా రూపవంతుడా అంటే, ఇన్నాళ్లూ తన కళ్ళల్లో అవుపడుతున్న పురుషునికి చేరువగానైనారాకపోవడమూ, డబ్బులేక, చదువులేక, అందం లేక, ఆర్జనలేక, హోదాలేక ఏమని చేసుకోవాలి? అని ప్రశ్నవచ్చి, సమాధానం రాక. ఆ సంబంధానికి ఒప్పుకోలేదు సావిత్రి అప్పుడు. పైన అదీకాక, అప్పుడప్పుడే, అంటే అదే కొత్తగా పెళ్ళి సంబంధాలు రావటమూ, పెళ్ళి చూపులకు యెవరెవరో రావటమూ మొదలైందేమో, మనస్సును అసలు సరిపెట్టుకోలేకపోయింది సావిత్రి, కలలు యెంత చెడ్డవి?! ఓడిపోతేనేకదా, రాజీపడడం. సరే తరువాత సావిత్రికి పెళ్ళయింది.

ఇవాళ రాత్రి సావిత్రి భర్తను అడిగింది. ఆ సాయంకాలం వచ్చిన స్నేహితునికి ఉద్యోగ మేమిటని? జీత మెంతని? పిల్లలెందరని? అతడు చెప్పాడు ఉద్యోగం తనకంటే పెద్ద ఉద్యోగమేనని, జీతంకూడా యెక్కువేనని, పిల్లలుకూడా వున్నారని. సావిత్రి విసుక్కుంది పిల్లలెంత మందో తనకు తెలీదని భర్త చెప్పినందుకు. ఆయన కన్నా మీరు యెక్కువ చదువుకున్నారు కదా! ఆ ప్రమోషన్ మీ కెందుకు రాలేదు? అని అడిగింది. "అతడికి సర్వీసు యెక్కువుంది." అని చెప్పారు ఆయన. గవర్న

మెంటుగురించికూడా విసుక్కుంది సావిత్రి. ఆ సుబ్బారావు భార్యా, పిల్లలూ గురించి ఆలోచించుకుంటూ నిద్రపోయింది.

ఆ తరువాత రెండురోజులకు సుబ్బారావు వచ్చి ఆ పక్క భాగంలో చేరిపోయాడు. కాని సావిత్రికి కాలక్షేపం ఏముంది? పైన సావిత్రికి సుబ్బారావు తమ పక్కభాగంలోకి అద్దెకు రావడం అంత ఇష్టంకూడా లేకపోయింది. వచ్చి చేరిన తరువాత, ఒకవేళ ఆ సుబ్బారావు తనను గుర్తుపట్టి వెనుకటి విషయాలనుజ్ఞాపకం చేసుకుంటాడేమో నని, ఆమెకు భయం కాదుగాని, ఇష్టం లేదు. ఆ సుబ్బారావు భార్య వచ్చిన తరువాత చెబుతాడో ఏమో! అయినా సుబ్బారావు భార్యా పిల్లలూ యెప్పుడు వస్తారా, తాను వాళ్ళని యెప్పుడు చూస్తానా? అని ఆమె మనసు ఎదురుచూడసాగింది. ఇంతలో ఇంకో వింతకూడా జరిగింది. ఇంకొక పక్క భాగంలోకి ఒకరోజు ప్రొద్దున తట్టా బుట్టా, ఉయ్యాలా జాడీలూ, పెట్టెలు, బెడ్డింగు, రేడియోలతో సహా యెవరో వచ్చి దిగారు. ఆ సాయంకాలం సావిత్రి యెలాగైనా వాళ్ళతో పరిచయం చేసుకోవాలని అనుకుంటూ వుండగా నాలుగైదేళ్ళ వాళ్ళ చిన్నపాప వచ్చి "అమ్మ అగ్గిపెట్టె ఇప్పించుకరమ్మంటోంది" అన్నది ముద్దు ముద్దు మాటలతో.

సావిత్రి ఆ పాపను పంపించి ఆలోచనలలో మునిగిపోయింది. పోనీ ఇంకా కొన్నాళ్ళ వరకూ సుబ్బారావుగారి సంసారం కోసం యెదురు చూడవలసిన అవసరం లేదు. ఈ భాగంలో వీళ్ళు వచ్చి చేరిపోయారు కదా! అనుకుంది. మర్రోజు ఆ కొత్తగా వచ్చి పక్క భాగంలో చేరిపోయిన గృహిణే మధ్యాహ్నంవచ్చి మాటా మాటా కలిపింది. ఆయన టూర్ వెళ్ళారట. నెలకు పది హేను రోజులు ఇంటి వద్దనే వుండరనీ, ఉద్యోగం చూడబోతే గొప్ప మంచి ఉద్యోగం కాదనీ, ఏదో బ్రతకటానికి చెయ్య వద్దా? అనీ, ఆవిడ చెప్పిన దాంట్లోని సారాంశం గ్రహించింది సావిత్రి. చిత్రం అనుకుంది. బాగానేవుంది అనుకుంది. తరువాత ఆ యిల్లాలు తరచూ సావిత్రి వద్దకు వచ్చి కూచుంటూ వుండేది. ఆమెకు ముగ్గురు పిల్లలు. పెద్ద పిల్ల. లిద్దరూ మగ పిల్లలు, చిన్నది ఆడపిల్ల. చిన్న పిల్ల సావిత్రి దగ్గరకు చనువుగా రావడం కూడా నేర్చుకుంది. ఆ చిన్న పిల్ల పేరు సరళ. మగ పిల్ల లిద్దరూ రామం, గోపీ. వాళ్ళు సావిత్రికి దూరంగా నిలుచుని బిక్క బిక్కమంటూ చూసే వాళ్ళు. వాళ్ళు కొంచెం పెద్ద పిల్లలు కాబట్టి అంత చనువుగా వచ్చే వాళ్ళు కాదు మొదట.

ఆ రోజు ఆదివారం కాబోలు, "రేపు మా వాళ్ళు వస్తారు" అని వోరోజు, ఆయన గారికి సుబ్బారావు చెపుతుంటే సావిత్రి విన్నది. సావిత్రికి వుత్సుకత కలిగింది. నవ్వూ వచ్చింది తన కుతూహలానికి. సుబ్బారావు అవాళంతా ఇల్లు సర్దుతునే వున్నాడు. అన్ని సంభారాలు వొక్కొక్కటీ తెచ్చిపడేస్తూ వున్నాడు. సావిత్రికి అతడి శ్రద్ధ చూసి ముచ్చటైంది. నవ్వూ వచ్చింది.

మర్రోజు ప్రొద్దున్నే ఇవాళ సుబ్బారావు గారి పిల్లలూ, భార్యా వస్తారు కాబోలు ననుకుంటూ, ఏదో ఆలోచించుకుంటూ, సావిత్రి పెరట్లోకి వెళ్ళింది యధాలాపంగా ఇన్నాళ్ళనుంచీ తాను చూదామను కుంటున్న వ్యక్తిని చూసింది. బాయిలర్‌తో నీళ్ళు పోస్తున్నాడాతడు. జన్మంతా నెలకు పదిహేను రోజులు ఇంటి దగ్గర వుండకుండా, టూర్ మీద తిరిగే వ్యక్తి. సావిత్రికి నవ్వొచ్చింది. ఇందుకేనేమో ఆయన పదిహేను రోజులు నెలలో టూర్ మీద పోవటం అనిపించింది, ఆమె యేంచేస్తున్నదో. ఇంటి దగ్గర వున్న పదిహేను రోజులూ యీయనే నీళ్ళు కాగబెట్టుకోవా లేమో! అనుకుంది సావిత్రి. కొంచెం పరిశీలనగానే చూసింది. సావిత్రికి భయమూ దిగులూ కాదుగాని, చాల ఆశ్చర్యం, కొంచెం విచారమూ కలిగాయి. తానొకప్పుడు అందంగా వున్నాడను కొన్న వ్యక్తి. ఒకప్పుడు పెళ్ళి చూపుల విషయకంగా తనను చూడటానికి వచ్చిన వాడు. తాను చేసుకుంటానని అన్నది కూడా అప్పుడు. తరువాత అతడు పిల్ల నచ్చలేదన్నాడని-తమ ఇంట్లో వాళ్ళు చెప్పుకున్నప్పుడు కోపంతోనూ, అవమానంతోనూ దహింప బడ్డది. ఆ సావిత్రే యీ సావిత్రి. చప్పున వంటింట్లోకి వచ్చేసింది. గుమ్మంలో నిలబడి పరిశీలించి చూసింది. సందేహం లేదు. కృష్ణమూర్తే! అప్పుడు "ఎమ్. ఏ" చదువుకుంటున్నాడు. తనను చూడటానికి వచ్చినప్పుడే కూచున్న నాలుగు నిముషాలూ అందరినీ నవ్వించాడు. తానూ ఎవరికీ కనపడకుండా నవ్వినట్లు చాలా రోజుల వరకూ తనకు జ్ఞాపక మున్నది. సావిత్రికి యెందుకో దిగులైంది. బయట పాలమనిషి కేక వినిపించి ఆలోచనల్లోంచి తేరుకుని గిన్నె పట్టుకుని వచ్చింది. పాల మనిషి పాలు పోస్తున్నాడు. పక్క భాగంలోంచి గిన్నె పట్టుకుని అతనూ వచ్చాడు. అతనే కృష్ణమూర్తి. పిల్ల నచ్చలేదని చెప్పిన వాడు. తనను చేసుకోనన్న వాడు! ఒకప్పుడు అందమైనవాడే సుమా అని తాననుకొన్నవాడు. గిన్నె పట్టుకుని వచ్చాడు పాలు పోయించుకోవటానికి.

పదేళ్ళ క్రితం ఆ ముక్కు ఇంకా బావుండేది. ఆ జుట్టు ఇంకా నిగనిగలాడుతూ వుండేది. ఆ కళ్ళు ఇంకా అల్లరి చేస్తూ వుండేవి. ఆమాట! ఇప్పుడసలు వినపడదేం! వాళ్ళావిడ పోనీ నెలకు పదిహేను రోజుల లెక్కచొప్పునైనా నవ్వినట్టు తనకు వినపడదు. సావిత్రి విషాదంగా నవ్వుకుంది.

సుబ్బారావుగారు అవాళ వంటచేస్తుంటే సావిత్రి ఆయనగారి చేత చెప్పించింది సుబ్బారావుకి. "పోనీ యీ పూటకు మా ఇంట్లో భోజనం చెయ్యవచ్చును. ఏమీ మేమంత తగనివాళ్ళమా, ఒక్కపూట మీకింత భోజనం పెట్టలేమా!" అని. కాని సుబ్బారావు వినలేదు. వాళ్ళ ఆదరానికి ప్రాణం లేచివచ్చినట్లుగా, సస్నేహంగా నవ్వుతూ జవాబిచ్చాడు. "ఇంకోసారి తప్పకుండా మీ ఇంట్లో భోజనం చేస్తాము లెండి" అని. సుబ్బారావు పచ్చడి నూరుకుంటూ వుంటే, కూర తిరగమోత వేస్తూవుంటే, సుబ్బారావుకి భార్యయెడల, సంసారం యెడల గల అనురాగానికి, అభిమానానికి సావిత్రి ముచ్చట పడింది. ఆమె మనస్సులో యెన్నెన్నో ఊహలు చెలరేగినయ్. విషాదంగాను, విచిత్రంగాను నవ్వుకుంది. సుబ్బారావు ఆఫీసుకి వెళ్ళిపోయాడు. కృష్ణమూర్తి మళ్ళీటూర్ మీద వెళ్ళాడుట. మధ్యాహ్నం కృష్ణమూర్తిగారి భార్యవచ్చి చెప్పింది. కృష్ణమూర్తి తనను చూడలేదులావుంది. చూస్తే గుర్తుపడితే ఏమనుకుంటాడో. అని చిత్రంగా ఆలోచించింది సావిత్రి. కృష్ణమూర్తి చిన్నబిడ్డ వచ్చిపిలవకుండానే

వాళ్ళోకూచుంది. సావిత్రి వద్దనమూ లేకపోయింది. ఎంత విచిత్రం అనుకుంది,

మధ్యాహ్నం సుబ్బారావుగారు ఏనుగెక్కి వచ్చినంత సంతోషంగానూ, కొత్తగా ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేస్తున్న వాడిలాగానూ, ముగ్గురనో, నలుగురినో యెత్తుకోవటంచేత కాక, ఇద్దరిని యెత్తుకుని తక్కిన ఇద్దరినీ నడిపించుకుంటూ, వీళ్ళనలుగురి తల్లికీ, మహారాణీగారి ముందు నడిచే వేత్రహస్తుడికి మల్లే ముందు నడుస్తూ, ఇట్లో ప్రవేశించాడు. ఆ దృశ్యం చాలా ముచ్చటగొల్పింది సావిత్రికి. వచ్చినవాడు వెంటనే తన ఆఫీసూ, పనీవుండదూ! వెళ్ళిపోవచ్చునా వెళ్ళిపోలేదు. ఆమెకు ఆ ఇంటిలోని సదుపాయాలను గూర్చి చెపుతూ, ఆ ఇంటి సౌకర్యమంతా తెలుగు ప్రబంధంలాగా వర్ణించి చెప్పాడు రాణీగారికి. ఆ తరువాత వాళ్ళను భోజనానికి కూచోబెట్టాడు కాబోలు, తన పాకశాస్త్ర ప్రావీణ్యాన్నిగురించి వాళ్ళకు ఉపన్యసిస్తూ, తనని తానే పొగడుకుంటున్నాడు. సావిత్రికి నవ్వూ వచ్చింది సుబ్బారావు సోదిని చూసి, ఆ రాణీగారిపై జాలీ కలిగింది. ఇంతలోనే ఆమె అదృష్టాన్ని అభినందించకుండా వుండలేకపోయింది మనసులోనే.


తరువాత సుబ్బారావుగారు ఆమె చెప్పిన లిష్టంతా వ్రాసుకుని నాలిగింటికో, ఐదింటికో బయటపడటమూ చూసింది. సుబ్బారావుగారి భార్య, ఇల్లు సర్దుకుని సాయంత్రం కాగానే తనకు తానై వచ్చి సావిత్రితో పరిచయమూ చేసుకుంది. సావిత్రి ఆవిడ మాట తీరునూ, మనిషి తీరునూ చూసి మ్రాన్పడిపోయింది. ఆమె అంత అందమైంది, అంత మాటా మన్ననా తెలిసినది. పిల్లలంతా తల్లి పోలికే. బిడ్డలను చూస్తే ముద్దుపెట్టుకుందామనిపించేటట్లుగా వున్నారు. పెద్ద పిల్లలిద్దరూ సావిత్రికి చెరివక పక్కా చేరిపోయారు. తక్కిన పిల్లలు ఎడపిల్లా, పసిపిల్లవాడూ. పెద్ద పిల్లలిద్దరూ మగపిల్లాడూ, ఆడపిల్లా, మూడోది మళ్ళీ ఆడ పిల్ల. పెద్ద పిల్లవాడికి ఎనిమి దేళ్లుంటాయి. రెండో పిల్లకు ఏడేళ్ళు. మూడోదానికి మూడోయేడు. పసిపిల్లాడికి ఏడాది వెళ్ళిందట. వాళ్ళ పేర్లు కృష్ణుడూ కాత్యాయనీ, రాధా, మధూ, వాళ్ళు రత్నమాణిక్యాలూ. వజ్రాలూ వైడూర్యాలూ. వాళ్ళ తల్లివేపు కన్నార్పకుండా చూసింది సావిత్రి. సుబ్బారావు పెళ్ళి సంబంధానికి వచ్చి తనను చూడటం జ్ఞాపకానికి వచ్చింది. కారూ బంగాళా, పిల్లలూ, నగలూ అన్ని కలలూ జ్ఞాపకానికివచ్చాయి అప్పుడు. కాని ఆ జ్ఞాపకాలను వెంటనే విస్మృతిలోకి నెట్టివేసింది.

ఆ తరువాత తరువాత కృష్ణమూర్తి తనను గుర్తుపట్టాడు అనీ ఆమె అనుకోలేదు, తనను చూశాడా అనీ అనుకోనూ లేదు. సుబ్బారావు భార్యాను గురించీ అనుకోలేదు, ఈ భాగంలోంచి ముగ్గురూ, ఆ భాగంలోంచి నలుగురూ వచ్చి తమ భాగంలోనే ఆడుకుంటారు, వాళ్ల బొమ్మల పెళ్ళిళ్ళు చేసుకుంటూ వుంటే, ఆ సంభారాలన్నీ తానే వాళ్ళకు సమకూర్చిపెడుతుంది సావిత్రి. సరళనూ కృష్ణణ్ణీ వొకపక్కగా తనదగ్గరకు తీసుకున్నప్పుడు గాని, రామాన్నీ, 'కాచి'నీ వొకదరిగా తీసుకున్నప్పుడుగాని తనకు కృష్ణమూర్తి, సుబ్బారావూ ఇద్దరూ గుర్తువస్తారు. మల్లెపువ్వులాంటి ఆ చిన్న పిల్లలను ఆ తీరున తన దగ్గరకు తీసుకున్నప్పుడు, ఎంత ముచ్చటకలిగినా ఆ తరువాత అంటే వాళ్ల భవిష్యత్తులో పెద్దవాళ్ళయిన తరువాత, వాళ్ళ జీవితాలను గురించి ఆలోచించడానికి సావిత్రి యెందుకో మనసులో భయపడిపోయేది. ●





# దాశరథి మధుమంజరి



ఆమె నడచి వచ్చిన ట్లనిపించును
చుక్క లాకసమ్ము నెక్కినపుడు

ఆమె కానుపింప అది నాకు పున్నమ,
మగువలేక పున్నమయె అమాస.

చలిని భరియింపలేను, వెచ్చదనమన్న
ఇచ్చగింపను; చెలిలేక యేది నచ్చు?

ఆమె చందమామయై అందగించిన
నేను నల్లమొయిలు నైన చాలు.

ఊర్వశికిని ఆమె కొక్కటే భేదమ్ము,
ఒకతె లేదు, ఒకతె ఉండి రాదు.

ఆకు రాలు కాల మరుదెంచె, అయమ
బుజమునుండి పైట పొరలి పడెను

చల్లగాలి వీచు చాడ్పున వచ్చును,
వేడిగాలి వోలె వెడలి పోవు.

ఎచట పువ్వు పూయ నచటనే అయమ
నవ్వుచున్నయట్లు నాకు తోచు

పొగడపూవువోలె పొలతి వాడు కొలంది
కొత్త పరిమళాలు గుప్పసాగు